సాక్షి నల్లగొండ

సోమవారం ၊ 27 ၊ మార్చి ၊ 2023



తెలంగాణకు శ్రీరామరక్ష

సీఎం కేసీఆర్.. తెలంగాణకు శ్రీరామరక్ష అని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు.

- 8లో



నేటి నుంచి మహాయజ్ఞం

యాదగిరిగుట్టలో సోమవారం నుంచి అక్షయ సువర్ణ లక్ష్మీనారాయణ మహాయజ్ఞం నిర్వహించనున్నారు.

- 10లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
37° / 23°

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.



న్యూస్‌రీల్

ఓపెన్ యూనివర్సిటీ సేవలు ఎనలేనివి



ధర్మానాయక్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రిన్సిపాల్ రామరాజు

దేవరకొండ : డాక్టర్ బీఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఓపెన్ యూనివర్సిటీ) సేవలు ఎనలేనివని విశ్వవిద్యాలయం జాయింట్ డైరెక్టర్, తెలుగు రాష్ట్రాల నోడల్ అధికారి డాక్టర్ బానోతు ధర్మానాయక్ అన్నారు. దేవరకొండ పట్టణంలోని ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం డాక్టర్ బీఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే మొట్టమొదటి సార్వత్రిక విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసించిన ఎంతో మంది నేడు ఉపాధి, ఉద్యోగాలు సాధించారని అన్నారు. న్యాక్ పర్ టీమ్ విజిట్‌లో భాగంగా ఈ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్.రామరాజు తెలిపారు. కార్యక్రమంలో సబ్జెక్ట్ కౌన్సిలర్లు, అంబేద్కర్ దూర విద్యాకేంద్రం జాక్టో ఎస్.పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ధర్మభిక్షం పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం



ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సత్యం

నల్లగొండ టౌన్ : ప్రజల మనిషి ధర్మభిక్షం పోరాట స్ఫూర్తి నేటితరానికి ఆదర్శమని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. ఆదివారం మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం 12వ వర్ధంతి సందర్భంగా స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ దొరలు, భూస్వాములకు వ్యతిరేకంగా భూమి, భుక్తి, వెట్టి చాకిరీ విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో ధర్మభిక్షం కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. నీతి, నిజాయితీ, నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు నాయకుడిగా కడవరకు పార్టీలో కొనసాగారని చెప్పారు. జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికోసం ఆయన చేసిన పోరాటం మరవలేనిదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉజ్జిని రత్నాకర్‌రావు, పల్లా దేవేందర్‌రెడ్డి, కైలాస్, జిల్లా యాదయ్య, నేతి యాదగిరి, విశ్వనాథుల లెనిన్, ముత్యాలు, మదార్, కౌసల్య పాల్గొన్నారు.

యాదాద్రీశుడికి శాస్త్రోక్త పూజలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో ఆదివారం నిత్యారాధనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు వేకువజామున సుప్రభాతం, స్వయంభూలకు బిందే తీర్థం, ఆరాధన, బాలభోగం, నిజాభిషేకం, సహస్ర నామార్చన చేపట్టి తులసీ దళాలతో అర్చించారు. ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజ వాహనసేవ, నిత్యకల్యాణం, జోడు సేవలు జరిపించారు. రాత్రి శ్రీస్వామి వారికి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు. సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచన పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

రైతుబంధు రాలే..!

- 7,561 మంది రైతుల ఎదురుచూపు
- రూ.38.9 కోట్లు పెండింగ్
- ఎలాంటి సమాచారం చెప్పని వ్యవసాయ శాఖ
- వస్తాయో.. రావోనన్న ఆందోళనలో రైతులు



నల్లగొండ అగ్రికల్చర్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతుబంధు పథకం డబ్బులు జిల్లాలో రైతులకు పూర్తిస్థాయిలో అందలేదు. ఇంకా 7,561 మంది రైతులకు.. ఇంకా రూ.38.9 కోట్లు ఖాతాల్లో జమ కావాల్సి ఉంది. రైతుబంధు జమ చేసే ప్రక్రియ నిలిచి 50 రోజులు అవుతోంది. అయితే, సీజన్ ఆరంభంలో అందాల్సిన రైతుబంధు పెట్టుబడి డబ్బులు సీజన్ ముగిసే కాలం ఆసన్నమైనా ఖాతాల్లో జమకాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పదెకరాలపైన ఉన్న రైతులకు..

గతేడాది డిసెంబర్ 28న యాసంగి రైతుబంధు డబ్బులు రైతుల ఖాతాల్లో జమచేయడాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. తొలిరోజు ఎకరం, తర్వాత రెండెకరాలు, ఆ తర్వాత మూడు ఎకరాలు ఇలా ప్రతిరోజు దశల వారీగా రైతుల ఖాతాల్లో నేరుగా రంగారెడ్డి ట్రెజరీ నుంచి జమచేశారు. పది ఎకరాలలోపు వరకు ఉన్న రైతులకు సక్రమంగా రైతుల ఖాతాల్లో రైతుబంధు డబ్బులు సక్రమంగానే జమచేశారు. పది ఎకరాల పైబడిన వారికి మాత్రం కొంత మందికి డబ్బులను జమచేసినప్పటికి చాలా మందికి అందలేదని తెలుస్తోంది. మరికొన్ని ప్రాంతాల్లో 16 ఎకరాలలోపు రైతులకు కూడా రైతుబంధు డబ్బులు ఖాతాల్లో జమైనట్లు తెలుస్తుంది. మూడు నెలలు పూర్తి కావస్తున్నప్పటికీ డబ్బులు జమకాకపోవడంతో అసలు రైతుబంధు అందుతుందో.. లేదోనన్న ఆందోళన రైతుల్లో నెలకొంది.

పెట్టుబడుల కోసం అప్పులు..

సాగుకు పెట్టుబడి కోసం ఉపయోగపడతాయన్న లక్ష్యంతో ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే సీజన్‌లో డబ్బులు జమకాని రైతులు మాత్రం అప్పులు చేసి సాగును చేశారు. వానాకాలంలో వేసిన పత్తి పంట కలిసి రాకపోవడంతో పాటుగా పత్తిని కొనే నాథుడు లేకపోవడం, దానికి తోడు రైతుబంధు డబ్బులు జమకాకపోవడం వల్ల రైతులు అప్పులు తీర్చలేక అనేక ఇబ్బందులు పడుతున్నారు.

రైతుబంధు సమితులు చొరవచూపేనా?

రైతుబంధు పథకం డబ్బులను విడుదల చేయించడానికి రైతుబంధు సమితి అధ్యక్షులు చొరవ తీసుకుంటారా లేదా అన్న అనుమానాలను వ్యక్తమవుతున్నారు. ఇటీవల రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ప్రమాణస్వీకార కార్యక్రమంలో.. రైతు బంధు డబ్బులు విడుదల చేయించాలని మంత్రి జగదీశ్‌రెడ్డికి విజ్ఞప్తి చేసిన విషయం తెలిసిందే.

ట్రెజరీలోనే పెండింగ్



"రైతుబంధు పథకం డబ్బులకు సంబంధించిన పూర్తి జాబితాను రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్‌కు పంపించాం. వారు రంగారెడ్డి ట్రెజరీ ద్వారా రైతుల ఖాతాల్లో దశల వారిగా జమచేశారు. ఇంకా మిగిలిన రైతుల డబ్బులు ట్రెజరీలో పెండింగ్‌లో ఉన్నాయి. నిధులు రాగానే రైతుల ఖాతాల్లో డబ్బులు జమవుతాయని తెలిసింది.

– వై.సుచరిత, డీఏఓ

సమాచారం లేని వ్యవసాయ శాఖ..

ఇప్పటి వరకు రైతుబంధు పథకం జమకాని రైతులకు ఎప్పుడు డబ్బులు జమ చేస్తారోనన్న సమాచారం జిల్లా వ్యవసాయ శాఖ వద్ద లేదు. రైతులు ప్రతిరోజు వ్యవసాయ శాఖ అధికారుల వద్దకు వెళ్లడం వారి నుంచి సరైన సమాధానం లేక తిరిగి వెళ్లిపోవడం పరిపాటిగా మారింది. అసలు వస్తాయో రావోనన్న సమాచారం కూడా రైతులకు చెప్పలేని దుస్థితిలో వ్యవసాయ శాఖ అధికారులు ఉన్నారు. ఎన్ని ఎకరాల కటాఫ్ వరకు డబ్బులు జమచేశారో కూడా సమాచారం చెప్పలేని పరిస్థితిలో వ్యవసాయ శాఖ ఉంది.

మిర్యాలగూడకు చేరిన జనచైతన్య యాత్ర



మిర్యాలగూడ మండలం ఆలగడప నుంచి ప్రారంభమైన భారీ బైక్ ర్యాలీ

- పట్టణంలో భారీ బైక్ ర్యాలీ
- మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద బహిరంగ సభ

మిర్యాలగూడ : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాదం, కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా చేపట్టిన జనచైతన్య యాత్ర ఆదివారం సాయంత్రం మిర్యాలగూడకు చేరుకుంది. సూర్యాపేట జిల్లా నుంచి నల్లగొండ జిల్లాకు ఆదివారం సాయంత్రం వచ్చింది. జిల్లా సరిహద్దు అయిన మిర్యాలగూడ మండలం ఆలగడప టోల్‌గేట్ వద్ద కమ్యూనిస్టు కార్యకర్తలు తరలివెళ్లి యాత్రకు స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఆలగడప, అవంతీపురం, బాదలాపురం, రాంనగర్‌బంధం, ఈదులగూడెం, హౌసింగ్‌బోర్డు, రాజీవ్‌చౌక్ మీదుగా మున్సిపల్ కాంప్లెక్స్ వరకు వాహనాలతో ప్రదర్శన సాగింది. సుమారు పది కిలోమీటర్ల మేర వందలాది బైక్‌లతో కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. సుమారు రెండు వేలకు పైగా ద్విచక్ర వాహనాలతో ర్యాలీ సాగడంతో మిర్యాలగూడ పట్టణంలో సందడి కనిపించింది. స్థానిక ఎన్టీఆర్ మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద బహిరంగ సభ నిర్వహించారు. ఈ యాత్రకు జిల్లా నాయకులు బంటు వెంకటేశ్వర్లు, ఎంసీపీఐయు నాయకులు వస్కుల మట్టయ్య సంఘీభావం తెలిపారు. సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, అఖిలభారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జూ కృష్ణన్, యాత్ర నాయకులు పోతినేని సుదర్శన్, మల్లు లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడారు.



మద్దతు తెలుపుతున్న ముస్లిం మహిళలు

యాత్రకు ముస్లిం మహిళల మద్దతు..

పవిత్ర రంజాన్ మాసం కొనసాగుతున్న తరుణంలో ముస్లిం మహిళలు ఉపవాసాలు ఉండి జనచైతన్య యాత్రకు మద్దతు పలికారు. ఈదులగూడెం నుంచి రాజీవ్‌చౌక్ మీదుగా మున్సిపల్ కాంప్లెక్స్ వరకు జరిగిన ప్రదర్శనలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మాడుగులపల్లి తహసీల్దార్ బదిలీ

మాడుగులపల్లి : తహసీల్దార్ అర్చన బదిలీ అయ్యారు. ఆమె మాడుగులపల్లి నుంచి చండూరుకు బదిలీపై వెళ్లినట్లు తెలిసింది. డిప్యూటీ తహసీల్దార్ నూల శివశంకర్ ప్రస్తుతం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. పూర్తిస్థాయి తహసీల్దార్ వచ్చేంత వరకు ఆయనే కార్యాలయ కార్యకలాపాలు చూస్తారు.

ఫార్మా అనుమతి రద్దు చేయాలని మంత్రికి వినతి

మునుగోడు : మండలంలోని కిష్టాపురం గ్రామంలో నిర్మిస్తున్న ఫార్మా కంపెనీ అనుమతులను వెంటనే రద్దు చేయించాలని కోరుతూ ఆదివారం నల్లగొండ ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మునుగోడు మండలంలోని అఖిలపక్ష పార్టీల నాయకులు మంత్రి జగదీశ్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. కంపెనీ నిర్మాణం చేపడితే ఈ ప్రాంత ప్రజలు అనారోగ్యాలకు గురికావడంతోపాటు, పచ్చని పంట పొలాలు కాలుష్యం కాటుకు దిగుబడి రాకుండా పోతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫార్మా వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ భీమనపల్లి సైదులు ఉన్నారు.

దేశంలో బీజేపీ పతనం ఖాయం



ఆమనగల్లు వద్ద హాథ్ సే- హాథ్ జోడో యాత్రలో పాల్గొన్న ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

- రాహుల్‌గాంధీపై అనర్హత వేటు ప్రజాస్వామ్యానికి చీకటి రోజు
- ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మిర్యాలగూడ : ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం త్వరలోనే ప్రజల చేతిలో పతనమవుతుందని టీపీసీసీ మాజీ అధ్యక్షుడు, నల్లగొండ ఎంపీ నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం వేములపల్లి మండలంలోని ఆమనగల్లు గ్రామం నుంచి మిర్యాలగూడ నియోజకవర్గం పరిధిలో చేపట్టే హాత్‌సే - హాత్ జోడో యాత్రను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ జాతీయ నాయకుడు రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వంపై అనర్హత వేటు వేయడం ప్రజాస్వామ్యంలో చీకటి రోజు అన్నారు. ఐదు సంవత్సరాల క్రితం కర్ణాటకలో జరిగిన సంఘటనను దృష్టిలో పెట్టుకుని ఇటీవల కాలంలో గుజరాత్‌లో కేసు నమోదు చేసి శిక్ష ఖరారు చేయడం దారుణమన్నారు. ఇలాంటి ఎన్ని కేసులు బనాయించినా కాంగ్రెస్ నాయకులు భయపడరని చెప్పారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీలు నియంతృత్వ పాలన సాగిస్తూ.. ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నాయని మండిపడ్డారు. 2024లో రాహుల్‌గాంధీ ప్రధాని కాబోతున్నారని ఆయన జోస్యం చెప్పారు. రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు చేపట్టిన భారత్ జోడో యాత్ర స్ఫూర్తితో మిర్యాలగూడ నియోజకవర్గంలో కూడా యాత్ర చేపట్టిన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మిర్యాలగూడ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్), పీసీసీ సభ్యుడు చిరుమర్రి కృష్ణయ్య, ఎంపీపీ పుట్టల సునీత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తమ్మడబోయిన అర్జున్, పార్టీ మండల అధ్యక్షుడు మాలి కాంతారెడ్డి, మాడ్గులపల్లి జెడ్పీటీసీ పుల్లెంల సైదులు, సర్పంచ్ వల్లంపట్ల యూనిస్‌ప్రవీణ్, డీసీసీ ఉపాధ్యక్షుడు రావు ఎల్లారెడ్డి, రేగటి రవీందర్, పల్లా వీరయ్య, పత్తిపాటి స్వరాజ్యలక్ష్మి, బంటు చొక్కా గౌడ్, బంటు మాధవరెడ్డి, బారి పాండు, పేరెల్లి నగేష్, కొమ్మనబోయిన ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



అవార్డుల ప్రదానోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, పక్కన కలెక్టర్లు, జెడ్పీ చైర్మన్లు ఎమ్మెల్యేలు

అవార్డుల వెనుక సర్పంచ్‌ల శ్రమ

- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయతీ సతత్ వికాస్ పురస్కారాల అందజేత

నల్లగొండ : ఉత్తమ గ్రామ పంచాయతీ పురస్కారాల వెనుక సర్పంచ్‌ల శ్రమ దాగి ఉందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం నల్లగొండలోని గుండగోని మైసయ్య ఫంక్షన్ హాల్లో పంచాయతీలకు దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయతీ సతత్ వికాస్ పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ఉమ్మడి జిల్లాలోని అవార్డులు సాధించిన సర్పంచ్‌లు, కార్యదర్శులకు మంత్రి జగదీశ్‌రెడ్డి.. జెడ్పీ చైర్మన్లు, ఎమ్మెల్యేలతో కలిసి పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ దఫా గెలిచిన సర్పంచ్‌లు ఎంతో అదృష్టవంతులని పేర్కొన్నారు. వారు గెలిచినప్పటి నుంచి ఇప్పటి వరకు గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 81 గ్రామ పంచాయతీలు పురస్కారం దక్కించుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. వైకుంఠదామాలు, పల్లె ప్రకృతి వనాలు, అంతర్గత రహదారుల నిర్మాణాలు అభివృద్ధికి నిదర్శనమన్నారు. సీఎం కేసీఆర్ ముందుచూపు, గొప్ప ఆలోచనా విధానం వల్ల తెలంగాణలో గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. హరితహారంలో తెలంగాణ రాష్ట్రం ఎంతో ముందుందని చెప్పారు. పర్యావరణంలో దేశంలోనే తెలంగాణ 5వ స్థానంలో నిలిచిందన్నారు. గత సంవత్సరం దేశవ్యాప్తంగా వచ్చిన అవార్డుల్లో తెలంగాణకే ఎక్కువగా వచ్చాయని, దానికి గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులతోపాటు స్థానిక ప్రజా ప్రతినిధుల కృషి ఎంతో ఉందన్నారు. అయితే కొందరు చిల్లర నాయకులు నిధులు రావడం లేదని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వారి విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్లు బండ నరేందర్‌రెడ్డి, గుజ్జ దీపికయుగేందర్‌రావు, ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గాదరి కిషోర్ కుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి, రవీంద్రకుమార్‌నాయక్, ఎన్.భాస్కర్‌రావు, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, నల్లగొండ, సూర్యాపేట కలెక్టర్లు వినయ్‌కృష్ణారెడ్డి, వెంకట్‌రావ్, అదనపు కలెక్టర్లు ఖుష్బూ గుప్తా, పాటిల్ హేమంత్ కేశవ్, దీపక్‌తివారీ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న మిర్యాలగూడ మండలం శ్రీనివాసనగర్ సర్పంచ్ వెంకటరమణ, కార్యదర్శి అనిత

ఆకట్టుకుంటున్న సేఫ్టీ ఎగ్జిబిషన్

- దివీస్‌లో అధునాతన సేఫ్టీ పరికరాల ప్రదర్శన

చౌటుప్పల్ : మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెంలో గల దివీస్ లేబోరేటరీస్ లిమిటెడ్ సంస్థలో జాతీయ భద్రతా వారోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన సేఫ్టీ ఎగ్జిబిషన్ ఆదివారం కొనసాగింది. పరిశ్రమలోని ప్రత్యేక బ్లాక్‌లో అత్యాధునిక సేఫ్టీ పరికరాలను ప్రదర్శిస్తున్నారు. సేఫ్టీ ఎగ్జిబిషన్ నెలాఖరు వరకు కొనసాగనుంది.

ప్రదర్శనలో ఉంచిన పరికరాలు

రోడ్డు ప్రమాదాలు, పరిశ్రమల్లో ప్రమాదాలు, రసాయనాల లీకేజీ, అగ్నిప్రమాదాలు, భవనాలు, నిర్మాణాలు కూలిపోయిన సమయాల్లో, గ్యాస్ లీకేజీ, నీటిలో మునిగిపోవడం, బహుళ అంతస్థుల మేడల్లో ప్రమాదాలు, కార్డియాక్ అరెస్టు జరిగినప్పుడు, ప్రమాదాల్లో వందలాది మంది చిక్కుకున్నప్పుడు ఉపయోగించేందుకోసం అత్యాధునికమైన యంత్రాలు, పరికరాలను పరిశ్రమ యాజమాన్యం అందుబాటులో ఉంచింది. ఈ పరికరాలపై ఇతర పరిశ్రమల కార్మికులకు సైతం అవగాహన కల్పించాలని దివీస్ యాజమాన్యం నిర్ణయించింది.



భద్రతపై అవగాహన కల్పిస్తున్న సేఫ్టీ అధికారులు

ఈదురుగాలుల బీభత్సం



కనగల్ : కురంపల్లిలో ఈదురు గాలుల వర్షానికి నేలకు ఒరిగిన వరిచేను



కనగల్ : రాయిబాయిగూడెంలో రాలిన వడ్లు



శాలిగౌరారం : రామంజాపురంలో కూలిన స్తంభం

కనగల్, శాలిగౌరారం : యాసంగి పంటపై ప్రకృతి కన్నెర్ర జేసింది. ఆదివారం ఈదురుగాలులతో కూడిన వడగాండ్ల(రాళ్ల) వాన బీభత్సం సృష్టించింది. కోతకు దశకు చేరుకున్న వరిచేలు పూర్తిగా నేలకొరిగాయి. వడగళ్ల వానకు వడ్లు రాలిపోయాయి. కనగల్ మండలం కురంపల్లి, రాయిబాయిగూడెం, యడవల్లి, లింగాలగూడెం, రేగట్టె, శాబ్దుల్లాపురం, రాంచంద్రపురం, శాలిగౌరారం మండలం మాంజాపురం, ఉప్పలంచ, ఎన్‌జికొత్తపల్లి, భైరవునిబండ, మనిమద్దె గ్రామాలలో ఈదురుగాలులు, వడగళ్లతో వర్షం కురిసింది. రామాంజాపురంలో రెండు 11 కేవీ విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో రామాంజాపురంతో పాటూ ఉప్పలంచ గ్రామాలకు విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది.

ఆధార్ నవీకరణ తప్పనిసరి..

- పదేళ్ల క్రితం పొందినవారంతా అప్డేట్ చేయించుకోవాల్సిందే..
- జూన్ 14వ తేదీ వరకు ఉచితంగా ప్రక్రియ
- ధ్రువీకరణ ఉంటేనే సవరణకు అవకాశం
- కలెక్టర్ చైర్మన్‌గా జిల్లా కమిటీ



నల్లగొండ : పదేళ్ల క్రితం పొందిన ఆధార్ కార్డులను అప్డేట్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. బ్యాంకు ఖాతా మొదలుకొని ఏది దరఖాస్తు చేసుకోవాలన్నా.. సంక్షేమ పథకాలు పొందాలన్నా.. ఆధార్ తప్పనిసరి అయ్యింది. అయితే కొందరు ఆధార్‌లో మార్పులు చేర్పులు చేస్తూ తప్పిదాలకు పాల్పడుతున్నారని గుర్తించిన ప్రభుత్వం ఆధార్ సవరణకు శ్రీకారం చుట్టింది. ఇందుకోసం విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) ఆధార్ సవరణలో కొత్త విధానాలను తీసుకొచ్చింది. మార్చి 15వ తేదీ నుంచి జూన్ 14వ తేదీ వరకు మూడు నెలల పాటు ఉచితంగా అప్డేట్ చేసుకునే అవకాశం కల్పించింది. అడ్రస్, ఐడీ ప్రూఫ్‌లను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసి ఎవరికి వారే ఉచితంగా కార్డు అప్‌డేట్ చేసుకునే అవకాశం ఉంది. సవరణకు మాత్రం రుసుం చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంది. సరైన ధ్రువీకరణ ఉంటేనే సవరణ చేయనున్నారు.

సవరణలు ఇలా..

- ఆధార్ కార్డులో పేరు సవరణకు ఫొటో గుర్తింపు కార్డు తప్పనిసరి. టెన్త్ మెమో, ఓటరు గుర్తింపు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్టు వంటి కార్డుల్లో ఏదైనా ఒకటి జతచేయాలి. సబ్ రిజిస్ట్రార్ జారీ చేసే వివాహ ధ్రువీకరణ కూడా జత చేయవచ్చు.
- చిరునామా మార్పునకు మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్ జారీ చేసే ధ్రువీకరణ ప్రతాన్ని అందజేయాలి. పాస్‌పోర్టు, బ్యాంకు అకౌంట్ బుక్, కరెంట్ బిల్లు, గ్యాస్ కనెక్షన్ బుక్‌లో సరైన అడ్రస్ ఉంటే వాటి ద్వారా కూడా మార్చుకోవచ్చు.
- పుట్టిన తేదీ సవరణకు పాన్ కార్డులో ఉన్న తేదీతో ధ్రువీకరించుకోవచ్చు. పిల్లలకు మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలు జారీ చేసే బర్త్ సర్టిఫికెట్ తప్పని సరి. ఇందుకు ఒక్కసారే అవకాశం ఉంటుంది. రెండోసారి మార్చాలంటే.. హైదరాబాద్‌లోని ప్రాంతీయ కార్యాలయంలోనే సాధ్యమవుతుంది.

జిల్లా కమిటీ నియామకం..

ఆధార్ నవీకరణ కోసం కలెక్టర్ ఆధ్వర్యంలో కలెక్టర్ చైర్మన్‌గా, జిల్లా అధికారులు సభ్యులుగా జిల్లా కమిటీని నియమించారు. ఇందులో అదనపు కలెక్టర్లతోపాటు మీసేవ అధికారి, ఇతర అధికారులను సభ్యులుగా ఉన్నారు. జిల్లాలో 46 మీసేవ కేంద్రాలు ఉన్నాయి. వాటి పరిధిలో ప్రస్తుతం ఆధార్ నవీకరణ కొనసాగుతోంది. అయితే నామినల్‌గా రూ.50 చార్జి చెల్లించి ఆధార్‌ను నవీకరించుకోవాల్సి ఉంటుంది. అయితే సొంతంగా చేసుకుంటే మాత్రం ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు.

క్లుప్తంగా

భార్య కాపురానికి రావడం లేదని..

● ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

తిరుమలగిరి: భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన తిరుమలగిరి మండల పరిధిలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. మండల పరిధిలోని రాఘవపురం గ్రామానికి చెందిన భూక్యా పంతులు(27) తొండ గ్రామంలో ఓ రైతు మామిడితోటలో పాలేరుగా పనిచేస్తున్నాడు. ఇతడి భార్య గొడవల కారణంగా ఎనిమిదేళ్ల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. పలుమార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీలు జరిగినా రాజీ కుదరలేదు. ఈ నేపథ్యంలో తీవ్ర మనస్తాపం చెందిన పంతులు శనివారం సాయంత్రం మామిడి తోటలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం స్థానిక రైతులు గమనించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి సత్తెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు.

కౌన్సిలర్‌కు గాయాలు

భువనగిరి : రోడ్డు ప్రమాదంలో కౌన్సిలర్‌కు గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం భువనగిరి పట్టణంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..స్థానిక 8వ వార్డు కౌన్సిలర్ పంగరెక్క స్వామి బైక్‌పై పట్టణశివారులోని వెంచర్ వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

పల్లె కిశోర్‌కు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న పల్లె కిశోర్‌కుమార్

రామగిరి(నల్లగొండ): నల్లగొండకు చెందిన పల్లె కిశోర్‌కుమార్ డాక్టరేట్ అందుకున్నారు. కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరు ఏషియన్ వేదిక కల్చర్ ఫౌండేషన్ వారు ఆదివారం కిశోర్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ సమాజసేవ చేసినందుకు గుర్తింపుగా డాక్టరేట్ లభించినట్లు తెలిపారు. డాక్టరేట్ అందజేసిన ఏషియన్ వేదిక కల్చర్ ఫౌండేషన్ సంస్థకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

రాజ్యాంగ పరిరక్షణకు ఉద్యమించాలి

నేరేడుచర్ల: మహనీయుల స్ఫూర్తితో రాజ్యాంగ పరిరక్షణకు ఉద్యమించాలని కేవీపీఎస్ సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి అన్నారు. ఆదివారం నేరేడుచర్లలో నిర్వహించిన కేవీపీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగాన్ని మార్చి మనుధర్మశాస్త్రాన్ని అమలు చేయాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. ఏప్రిల్‌లో రాజ్యాంగ పరిరక్షణకు గ్రామగ్రామాన యాత్రలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు తదితరులున్నారు.

బీఆర్‌ఎస్ గెలుపుతోనే అభివృద్ధి

● బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పథకాలు శూన్యం
● మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి



ధర్మభిక్షం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి



తిప్పర్తి : ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి చిత్రంలో కడియం శ్రీహరి తదితరులు

రామగిరి(నల్లగొండ): బీఆర్‌ఎస్ గెలుపుతోనే నల్లగొండలో అభివృద్ధి ప్రారంభమైందని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. ఆదివారం తిప్పర్తిలో మార్కెట్ యార్డులో జరిగిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో నల్లగొండలో అనేక పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అభివృద్ధిని గాలికి వదిలేశాడని విమర్శించారు. భూపాల్‌రెడ్డి గెలిచిన మూడున్నర సంవత్సరాల కాలంలో నల్లగొండకు మెడికల్ కాలేజీ, హైదరాబాద్ తరహాలో ఐటీ హబ్ తీసుకొచ్చారని తెలిపారు. నల్లగొండ జిల్లా కేంద్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక చొరవ చూపిస్తున్నట్లు పేర్కొన్నారు. మోదీ సొంత రాష్ట్రంలో కేవలం 6గంటలు మాత్రమే కరెంటు అందుతుందని, తెలంగాణలో 24 గంటల పాటు వ్యవసాయానికి ఉచిత కరెంటు అందిస్తున్నామని గుర్తుచేశారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టడం లేదని కేసీఆర్‌పై కోపంతో రాష్ట్రానికి రావాల్సిన రూ. 35 వేల కొట్ల నిధులు కేంద్ర ఇవ్వడం లేదన్నారు. గ్రామ స్థాయిలో ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టాలని బీఆర్‌ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపొంది మూడో సారి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అంతకు ముందు తిప్పర్తి సెంటర్ నుంచి మార్కెట్ యార్డు వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌నాయక్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. అనంతరం ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ముఖ్యమంత్రి కేసీఆర్ సందేశాన్ని చదివి వినిపించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, కాసోజు శంకరమ్మ, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పాశం రాంరెడ్డి, ఎంపీపీ నాగులవంచ విజయలక్ష్మిలింగారావు, పల్‌రెడ్డి రవీందర్‌రెడ్డి, వనపర్తి నాగేశ్వరరావు, ఏనుగు వెంకట్‌రెడ్డి, పాశం సంపత్‌రెడ్డి, చీర పంకజ్‌యాదవ్, ముత్తినేని శ్యామ్‌సుందర్, కందుల లక్ష్మయ్యరేణుక, కటింక సత్తయ్యగౌడ్ పాల్గొన్నారు.

ధర్మభిక్షం జీవితం ప్రజాసేవకు అంకితం

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ఎంపీగా, సూర్యాపేట ప్రథమ శాసనసభ్యుడిగా పనిచేసిన బొమ్మగాని ధర్మభిక్షం జీవితమంతా ప్రజాసేవకే అంకితం చేశారని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి కొనియాడారు. బొమ్మగాని ధర్మభిక్షం 12వ వర్ధంతి సందర్భంగా సూర్యాపేట పట్టణంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల వద్ద గల ధర్మభిక్షం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వర్ధంతి సభలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ ధర్మభిక్షం పేదల మనిషి అని, అరవై ఏళ్ల క్రితమే సూర్యాపేట ప్రాంతంలో పేద విద్యార్థులు చదువుకోవడానికి పాఠశాలలు, వసతి గృహములు ఏర్పాటు చేసి, ఈ ప్రాంతంలో విద్యా వికాసానికి కృషి చేశారని పేర్కొన్నారు. గీత కార్మికుల సంక్షేమం కోసం సంఘాలు నెలకొల్పారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు అనంతుల మల్లేశ్వరి, జిల్లా గ్రంథాల చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, జెడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకట్ నారాయణ గౌడ్, మున్సిపల్ చైర్ పర్సన్ పేరుమాళ్ల అన్నపూర్ణ, వైస్ చైర్మన్ పుట్టా కిషోర్, బూర వెంకటేశ్వర్లు, బొమ్మగాని శ్రీనివాస్, చామల అశోక్, మొరగుండ్ల లక్ష్మయ్య పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్.. తెలంగాణకు శ్రీరామరక్ష

● కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టేందుకే కవితపై లిక్కర్ కేసు
● మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి



బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి

మిర్యాలగూడ: సీఎం కేసీఆర్.. తెలంగాణకు శ్రీరామరక్ష అని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. శనివారం వేములపల్లి మండలం బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం పట్టణంలోని శ్రీమన్నారాయణ ఫంక్షన్‌హాల్‌లో ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9 ఏండ్ల పాలనలో రాష్ట్రంలో ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఉచిత విద్యుత్, రుణమాఫీ, రైతుబంధు, రైతు బీమా, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్ తోపాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి తెలంగాణను అభివృద్ధి పథంలో కేసీఆర్ ముందుకు తీసుకెళ్తున్నారని చెప్పారు. ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు ఎంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్ల కోసం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలతో రూ.1లక్ష అందిస్తున్నామని, గర్భిణీలకు కేసీఆర్ కిట్ అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 45లక్షల మంది వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు, ఒంటరి మహిళలకు పెన్షన్ అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. గ్రామాల్లో రహదారులు, ప్రకృతివనం, శ్మశానవాటికలను ఏర్పాటు చేసి గ్రామాల అభివృద్ధికి పాటుపడుతున్నామని తెలిపారు. ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న తెలంగాణ ప్రభుత్వంపై కాంగ్రెస్, బీజేపీ నాయకులు పసలేని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. సీఎం కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టేందుకే తెలంగాణ ఆడబిడ్డ కవితపై లిక్కర్ కేసు బనాయించారని ఆరోపించారు. సీబీఐ, ఈడీ, ఎన్‌ఐఏ లాంటి సంస్థలను గుప్పిట్లో పెట్టుకోని ప్రతిపక్ష పార్టీల నాయకులను ఇబ్బందులను పెడుతున్నారని ఆరోపించారు. ప్రజల సంపదను మోదీ కేవలం 22 మంది పారిశ్రామికవేత్తలకు కట్టబెడుతూ రూ.12లక్షల కోట్ల రుణమాఫీ చేశారన్నారు. అందులో 20 మంది గుజరాత్ రాష్ట్రానికి చెందిన వారేనన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా మిర్యాలగూడలో బీఆర్‌ఎస్‌దే విజయమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, ఆగ్రోస్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వేములపల్లి జడ్పీటీసీ ఇరుగుదిండ్ల పద్మవెంకటయ్య, పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

గరిడేపల్లి : గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన ఆదివారం మండలంలోని ఎల్‌బీనగర్‌లో చోటు చేసుకుంది. గరిడేపల్లి ఎస్‌ఐ కొండల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... గరిడేపల్లి మండలం ఎల్‌బీనగర్‌కు చెందిన దొంతిరెడ్డి నరేందర్‌రెడ్డి తండ్రి ఆరోగ్య రీత్యా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. మధ్యాహ్నం ఎల్‌బీనగర్‌లోని ఇంటి వద్దకు రాగా తలుపులు తెరుచుకొని ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి బీరువా పగులగొట్టి ఉంది. బీరువాలో గల ఆభరణాలు కనిపించలేదు. సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి క్లూజ్ టీం చేరుకొని ఆధారాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం



భరత్ మృతదేహం

మిర్యాలగూడ : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం చెందారు. దామరచర్ల, కోదాడ, సూర్యాపేట మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. అడవిదేవులపల్లి మండలం ముదిమాణిక్యం గ్రామానికి చెందిన పిల్లి వెంకటేశ్వర్లు(47) మరో వ్యక్తి సుదాయితో కలిసి వాడపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యానికి గురైన బంధువును పరామర్శించేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్లారు. తిరుగు ప్రయాణంలో స్థానిక సిమెంట్ పరిశ్రమలోకి వెళ్లేందుకు రోడ్డుపై లారీ యూటర్న్ తీసుకుంటుండగా ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పిల్లి వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతిచెందాడు. మరో వ్యక్తి సుదాయికి తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు.పోస్టుమార్టం నిమిత్తం పిల్లి వెంకటేశ్వర్లు మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడు కోటేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని..

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలోని శ్రీమన్నారాయణ కాలనీకి చెందిన నాగర్జునపు పాండురంగాచారి(55) స్కూటీపై ఆదివారం నయానగర్ రంగాథియేటర్ వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో బస్టాండ్ ఇన్‌గేట్ ఎదురుగా ఏపీలోని ఏలూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కిందపడిన అతనిపై నుంచి బస్సు వెళ్లడంతో తల ఛిద్రమై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటనపై మృతుడి కుమార్తె నాగసాయి ఫిర్యాదు మేరకు సీఐ శివశంకర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని..

సూర్యాపేటక్రైం : పెన్‌పహాడ్ మండలం సింగారెడ్డిపాలెం గ్రామానికి చెందిన శ్రీరాముల భరత్, కుంచం మహేందర్‌లు బైక్‌పై సూర్యాపేటకు వస్తున్నారు. మార్గమధ్యలో పట్టణంలోని జమ్మిగడ్డ ప్రాంతంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భరత్ (19) అక్కడికక్కడే మృతి చెందగా మహేందర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సూర్యాపేట పట్టణంలో మృతుడు భరత్ బజాజ్ షోరూంలో బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. మహేందర్ పెయింటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. భరత్ మృతితో సింగారెడ్డిపాలెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడి తండ్రి శ్రీరాముల క్రిష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజశేఖర్ తెలిపారు.

ఆధ్యాత్మిక జ్ఞానం.. జీవితానికి మార్గం

భూదాన్‌పోచంపల్లి : ఆధ్యాత్మిక జ్ఞానం అవరోధాలను అధిగమించి చక్కటి జీవితానికి మార్గాన్ని చూపిస్తుందని సంగీత, సాహిత్య భాగవత వేదాంత గురుపరంపర అద్వైత్వ ప్రచారకులు(గుంటూరు) తుకారాం అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని శ్రీ మార్కేండేశ్వర స్వామి దేవాలయంలో ఆధ్యాత్మిక భక్త సమాజం ఆధ్వర్యంలో ఆత్మజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక జ్ఞానమనేది కులం, దేశం, ప్రాంతానికి పరిమితం కాదని, అది సమస్త మానవులకు సంబంధించిందని అన్నారు. ఏ వృత్తిలో ఉన్న, చేసే సేవకు ఆధ్యాత్మికం తోడైతే ఆ సేవ నిస్వార్థం అవుతుందని అన్నారు. అంచెలంచెలుగా జ్ఞానం, యోగం, బ్రహ్మైక స్థితి కల్గి చివరకు మానవుడు జీవనముక్తిని పొందుతాడని పేర్కొన్నారు. అలాగే శ్రీ మద్భవద్గీత సాధన రహస్యాలపై ప్రవచించారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక భక్త సమాజం అధ్యక్షుడు కడవేరు చంద్రయ్య, కటకం తుకారాం, భారత పురుషోత్తం, సీత రాములు, నోముల అశోక్, సీత సత్యనారాయణ, చక్రాల నర్సింహ, కడవేరు ఎల్లప్ప, సూరెపల్లి యాదగిరి పాల్గొన్నారు.

'మన ఊరు- మన చరిత్ర' అందుబాటులోకి తెచ్చేందుకు కృషి

● తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్



గ్రంథాలయ భవన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న జూలూరి గౌరీ శంకర్

చిలుకూరు: మన ఊరు- మన చరిత్రను నేటి ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు కృషిచేస్తున్నట్లు తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీ శంకర్ పేర్కొన్నారు. ఆదివారం మన ఊరు - మన చరిత్రలో భాగంగా చిలుకూరు గ్రామంలో ఆయన పర్యటించి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 12,769 గ్రామాలకు సంబంధించిన మన ఊరు- మన చరిత్ర పుస్తకాలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి ఆ గ్రామాలకు చెందిన డిగ్రీ విద్యార్థులచే పుస్తకాలు రాయిస్తున్నట్లు తెలిపారు. పలు దేశాల చరిత్రలు, ప్రముఖ నాయకుల చరితలు పుస్తకాల్లో రూపొందిచినప్పుడు మనం పుట్టిన ఊరు చరిత్రను కూడా మనం తెలుసుకోవాలని అన్నారు. పర్యటనలో భాగంగా చిలుకూరు బస్టాండ్ సెంటర్‌లో నూతనంగా నిర్మిస్తున్న గ్రంథాలయం భవనాన్ని పరిశీలించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పాత చిలుకూరులో రామాలయం, చెన్నకేశవ ఆలయాన్ని ఆయన పరిశీలించి దేవాలయాల చరిత్రను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ గ్రామాన్ని పూర్తిగా పరిశీలించి, అన్ని కోణాల్లో ఊరి చరిత్ర పుస్తకాలను రూపొందించాలని సూచించారు. ఇందుకు గ్రామస్తులు సహకరించాలని కోరారు. కార్యక్రమానికి ముందు స్వాంతంత్ర్య సమరయోధులు, మాజీ ఎంపీపీ దొడ్డా నారాయణరావు ఇంటికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వరీ, ఎస్‌ఐ చల్లా శ్రీనివాస్ యాదవ్, సర్పంచ్ కొడారు బాబు, రైతు సమన్వ సమితి మండల అధ్యక్షుడు దొడ్డా సురేష్‌బాబు, డీఎల్‌డీఏ డైరక్టర్ కస్తూరి నర్సయ్య, గ్రంథాలయం, సొసైటీ చైర్మన్లు అంబాల వెంకటి, అలసకాని జనార్దన్, వేముల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దేశంలో రైతు ఆత్మహత్యలు పెరిగాయి

● సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు విజ్జు కృష్ణన్



సభలో మాట్లాడుతున్న విజ్జు కృష్ణన్, చిత్రంలో జూలకంటి, సుదర్శన్ తదితరులు

నేరేడుచర్ల: బీజేపీ పాలనలో రైతుల ఆత్మహత్యలు పెరిగాయని, కేంద్రంలో ఆ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటినుంచి నేటివరకు దేశంలో 4లక్షల మంది రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు విజ్జు కృష్ణన్ ఆరోపించారు. ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన జన చైతన్య యాత్ర నేరేడుచర్లకు చేరుకున్న సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నాలుగు నల్లా చట్టాలను తీసుకరావడంతో నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రైతులు 380 రోజుల పాటు ఉద్యమించడంతో కేంద్రం దిగివచ్చిందన్నారు. రైతు వ్యతిరేక విధానాలపై ఉద్యమించేందుకు సిద్ధం కావాలన్నారు. మతోన్మాద బీజేపీకి దేశంలో చోటు లేకుండా చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. దేశంలో నరేంద్రమోదీ మాటలు నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ దేశ ప్రజలకు ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ, అంబానీలకు కట్టబెడుతున్నారన్నారు. చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పి పార్లమెంటులో ఆమోదించడం లేదన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలు తెలియజేసేందుకే జన చైతన్య యాత్రలు : జూలకంటి

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేసేందుకు జన చైతన్య యాత్రలను చేపట్టామని మాజీ ఎమ్మెల్యే, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. 135 కోట్ల ప్రజల భవిష్యత్‌ను నిర్ణయించే మోదీ అన్నివర్గాల ప్రజలకు నష్టం చేసే నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. 550 రైతు సంఘాలు, 5లక్షల మంది రైతులతో ఏప్రిల్ 5న ఢిల్లీలో భారీ ధర్నాను నిర్వహించి తీరుతామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు, సీపీఎం పట్టణ కార్యదర్శి కె.నగేష్, సిరికొండ శ్రీను పాల్గొన్నారు.

ఉత్తమ గ్రామ పంచాయతీలకు పురస్కారాలు



నల్లగొండలో మంత్రి జగదీశ్‌రెడ్డి చేతుల మీదుగా దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పంచాయతీ పురస్కారాలు అందుకుంటున్న సర్పంచ్‌లు, కార్యదర్శులు
















